


# రంకె

## స్వామి

'నేను చచ్చిపోయి ఇప్పటికి ఎనిమిది దినాలయ్యింది,' అనుకున్నాడు వరదప్ప. అతడు కళ్లు నులుముకుని లేచేటప్పటికి ఒక కాంతి వృక్షం కింద ఉన్నాడు. ఏ అగాధాల్లోని నక్షత్ర నివహమో భళ్లుమని ముంచెత్తుతున్న పాలపుంత వెలుగుల్లోంచీ ఆ కాంతి వృక్షం విడిగా లేదు.

ఆ చెట్టు కింద కాంతి చర్మంతో మేల్కొన్న వరదప్ప కూడా విడిగా లేడు. ఆకాశమూ, వృక్షమూ, వరదప్ప అన్నీ ఒకే కాంతితో తయారై, ఆ ఒకే కాంతిలోనే మునిగిపోయి కన్పిస్తున్న పారదర్శక అద్భుతం.

వరదప్ప హృదయంలో చల్లగా వెలిగే చిత్తశాంతి- తాను భూమ్మీద బతికి వుండగా ఎప్పుడైనా కలిగిందా ఈ చిత్తశాంతి? ఎట్లా కలుగుతుంది అనంత రైతుగా జన్మ ఎత్తింతరువాత!

'హమ్మయ్య! నేను మంచిపనే చేసినాను, పురుగుల మందు తాగి సచ్చిపోయి. లేకపోతే ఈపాటికి ఇంకా ఆ అప్పులోళ్ల మధ్యే నరకం అనుభవిస్తూ ఉందును,' అని తేలికపడిన మనసుతో గుండె నిండా గాలి పీల్చుకోబోయినాడు. కానీ ఆ లోకంలో గాలిలేదు. కాంతిని మాత్రం పీల్చవచ్చు.

వరదప్ప శాంతిగా కూర్చుని కాంతిని శ్వాసిస్తూ ఉండగా అతని చుట్టూ అలుముకున్న కాంతిలోంచి దోసెడు కాంతి పదార్థం మాదిరి ఘనీభవించి రెండు కాంతి ఆకారాలుగా సాగినాయి.

దేవతలు ప్రత్యక్షమైనట్టు అబ్బురపడి లేవబోయినాడు వరదప్ప. చూసుకుంటే అప్పటికే తాను నిలబడి ఉన్నాడు. లేచి నిలబడటానికి తాను చేసిన ప్రయత్నం ఏమీలేదు. నిలబడల్ల అనుకున్నాడు, నిలబడి ఉన్నాడు. అనుకున్నాడు, జరిగింది! అంతే!!

ఎంత బాగుందిదీ? ఈ లోకంలో చచ్చిపోవాలని మనసులో కోరుకుంటే చాలు చచ్చిపోవచ్చు. భూమ్మీద మాదిరి పురుగుల మందు తాగే అవసరమే ఉండదు అనుకున్నాడు వరదప్ప.

అతని కంటి ముందు వెలుగు వాతావరణానికి చిల్లిపడింది. అది లోలోతుకు సాగి పెద్దదై చీకటి సొరంగమైంది. ఆ సొరంగంలోంచి చూస్తే భూమ్మీద తాను చచ్చిపోవడానికి చేసిన ప్రయత్నమంతా వరదప్పకు దృశ్యాలు దృశ్యాలుగా కన్పిస్తూ ఉంది.

*

రాత్రంతా అప్పులోళ్ల మాటలు చెవుల్లో మారుమ్రోగి, నిద్రరాక సాప మీద అట్ల పొర్లి, ఇట్ల పొర్లి, మసక మసక గుడ్డి దీపం వెలుతురులో గొంతు కూర్చొని, బీడీలు తాగి, చింత చేసీ చేసీ చచ్చిపోదామని తీర్మానం చేసుకుని, పొద్దున్నే లేచి ముద్ద తిని, పురుగుల మందు కోసం టౌనుకు బయల్దేరుతుంటే- యాటికి? అని అడుగుతున్న భార్యతో బ్యాంకుకి అని చెబుతున్న వరదప్ప.

పొద్దున్నే మొదటి అబద్ధం!

''నాయనా! నాయనా! వచ్చేటప్పుడు రెండు రిబ్బన్లు కొనక్కరా నాయనా, బొత్తిగాలేవు,'' అని పదహారేండ్ల కూతురు బతిమిలాడుతుంటే, ''తెస్తాను లేమ్మా,'' అంటున్న వరదప్ప.

రెండవ అబద్ధం.

''నాయనా, నాయనా! టౌనులో కాపీబుక్కు కొనక్కరా నాయనా! లేకపోతే మా అయ్యవారు తంతాడు,''

అని ఆరో తరగతి కొడుకు వెంటబడుతుంటే- "తెస్తా నులే అప్పా," అని వానితో నమ్మబలుకుతున్న వరదప్ప.

మూడో అబద్ధం!

బస్సుదిగి అప్పులిచ్చే వాడుక షాపులోకి పోకుండా మరో షాపులో పురుగులమందును దుడ్లుపెట్టి కొనుక్కుని వస్తుంటే, ఠక్కున తనకు మామూలుగా అప్పులిచ్చే కుంజేటి నారాయణశెట్టి ఎదురై- "అప్పు బేరమైతే మా అంగడి, నగదు బేరమైతే వాళ్ల అంగడి. ఏం న్యాయమయ్యా నీది?" అని నిష్ఠూరం పోతుంటే- "లేదు లేదు సావుకారీ! ఇది కూడా అప్పే," అని తత్తర పడుతున్న వరదప్ప.

నాలుగో అబద్ధం!

'అప్పులు చేసేదానికే కాదు, సచ్చిపోయేదానికి కూడా ఇన్ని అబద్ధాలు చెప్పల్లా? థూత్! రోషమున్న మొగోడెపుడూ ఈ తప్పుడు బతుకు బతకడు,' అని తన మీద తనే యాసరికపడినాడు వరదప్ప.

ఊరికివతలే బస్సు దిగి, చరచరా నడిచి, చేన్లోకి పోయి, చుట్టూ చూసి, పురుగుల మందు డబ్బా మూత పీకి ఒకేసారి ఎత్తికొట్టి-

అబ్బా! అమ్మా! వాసన. యాక్! కడుపులో మంట! తిప్పుతా వుంది. యాక్! యాక్... ఈ నరకం భరించలేను, తండ్రీ! తొందరగా తీసుకుపో దేవుడా. పేగులు తెగిపోతా వున్నాయ్. అబ్బా! అమ్మా! అంటూ మూల్గి మూల్గి, అరుపులు బయటపడకుండా నోట్లో పైబట్ట కుక్కుకుని పొర్లాడి, చచ్చిపోతూ చచ్చిపోతూ వరదప్ప.

సారంగం సన్నబడి, చీకటి చిల్లిగా మారి, ప్రవాహంలో మునిగిపోయిన సుడి మాదిరి తెల్లటి వెలుగుతో అలుక్కుపోయి, అంతర్ధానం కాగానే ఊపి రాడని అగాథం లోంచి బయటపడినట్లు ఒక్కసారి కాంతిని ఎగపీల్చిన వరదప్ప. చూస్తే... చేతులు కట్టు కుని వినయంగా తన అంగీకారం కోసమే నిరీక్షిస్తున్న దేవదూతలు.

"రైతు మహాశయునికి నమస్కారం," అని వాళ్లు చేతులు జోడించినారు. వరదప్ప ఆశ్చర్యం నుండి తేరుకోకముందే- "మీరు మా వెంట వస్తే ఇంకొంచెం పైకి దారి చూపుతాం," అన్నారు వినయంగా.

వరదప్ప 'సరే' అని సంకల్పించుకున్న మరు క్షణం మరో లోకంలో ప్రత్యక్షమై వున్నాడు.

'అరే ప్రయాణం చేయకుండానే వచ్చేసినామే, అనుకున్నచోటికి,' అని అనుకుంటూ ఉండగా ఎదురుగా ఎత్తైన పీఠం మీద కాంతి సింహాసనాసీనుడైన దేవదేవుడు కన్పించినాడు. ప్రశ్నార్థకంగా చూసి అడుగు తున్నాడు-

"ఎవరీ మానవుడు?"

"ఇతడొక రైతు మహాశయుడు మహాప్రభూ," అని దేవదూతలు చెప్పగానే-

"ఈ లోకంలో రాజకీయ నాయకులని విచా రిస్తాం. కంట్రాక్టర్లని విచారిస్తాం. ఉద్యోగస్తుల్నీ, వ్యాపా రస్తుల్నీ, లాయర్లనీ విచారిస్తాం. అంతేగానీ రైతుల్ని న్యాయ విచారణ చెయ్యం. రైతుల్ని ఎక్కడా ఆపకుండా స్వర్గానికి తీసుకుపోవాలని మీకు తెలీదా?" అని కఠినంగా దండించినాడు దేవదేవుడు.

దేవదూతలు వినయంగా చేతులు జోడించి-

"ప్రభువా! మమ్మల్ని అంత కఠినంగా దండించ వద్దు. భూమిపుత్రులను స్వర్గానికి తీసుకుపోవాలని మాకు తెలుసు. కానీ ఈ వరదప్ప భూమికి తన పూర్తి కాలం సేవ చేయకుండానే మధ్యలో పారిపోయి వచ్చి నాడు. తాను మోయవలసిన సంసారం బరువును ఒక్క భార్య మీదికే తోసేసి వచ్చినాడు. పురుగుల మందు తాగి వ్యవసాయం నుంచి విముక్తి పొందాలను కున్నాడు," అని విన్నవించుకున్నారు దేవదూతలు.

లక్ష సూర్యుల్ల కాంతిని కూడా అధఃకరించగల ఆ దేవదేవుని ముఖం, దిగులుగా మారిపోయింది.

"స్వర్గానికి పోవలసిన ఈ రైతుకు శిక్ష విధిస్తున్నం దుకు బాధపడుతున్నాను. అయినా తప్పదు. చట్టం చట్టమే," అని సాలోచనగా చూసినాడు దేవదేవుడు. అప్పుడు వరదప్ప చేతులు జోడించి విన్నవించు కున్నాడు.

"నన్ను ఆకాశం మోసం చేసింది. సరే! ఆకాశానికి నేను ఓటేయలేదు కదా! వ్యవసాయం మార్కెట్టు మోసం చేసింది. సరే! వ్యాపారాస్తులకూ నేను ఓటు వేయలేదు కదా! మరి దేవా? నాతో ఓట్లేయించుకొన్న రాజకీయు నాయకులు కూడా నన్ను మోసం చెయ్యొచ్చా?"

రైతుగా తనను భూమ్మీద ఇంకా ఎవరెవరు ఎట్లెట్ల మోసం చేసిందీ వరదప్ప వివరించబోతుంటే మధ్యలో అడ్డుకుని దేవుడు దయగా నవ్వినాడు.

"నీకు జరిగిందంతా నాకు తెలుసయ్యా. కానీ, చివరికి నువ్వు చేసిందేమిటి? అంతా కలిసి నిన్ను మోసం చేస్తే నువ్వు నీ ఆలుబిడ్డలను మోసం చేస్తావా? అప్పుల బరువును నీ ఆలుబిడ్డల మీద మోపి, నువ్విట్లా

హాయిగా చేతులూపుకుంటూ రావడం న్యాయమా? ఒకసారి భూమ్మీదకి పోయిరా! అక్కడ నిన్ను నమ్ము కున్నవాళ్లు ఎన్ని బాధలు పడుతున్నారో చూసిరా! అప్పటికీ నువ్వు ఆత్మహత్య చేసుకోవడమే మంచి దయింది అని, నీకు తోస్తే నువ్వు కోరుకున్నట్లే నిన్ను స్వర్గానికి పంపుతా!''

*

వరదప్ప ఎదురుగా వెలుగు వాతావరణంలో చుక్క ఏర్పడి, అది చిల్లిగా మారి ఆ తరువాత చీకటి సొరంగంగా ఏర్పడితే ఈసారి వరదప్ప ఆ సొరంగంలోకి దూరి జారుతూ జారుతూ వస్తున్నాడు కిందికి.

ప్రయాణం చేస్తున్నట్లే ఉంది. కానీ ప్రయాణం చేయడానికి తన కంటే వేరుగా స్థలంలేదు. అసలు స్థలకాలాలు మనిషిలో ఉన్నాయా? లేక స్థలకాలాలలో మనిషి ఉన్నాడా?

కాంతిలోకం లోంచి మట్టి ఆవరణం లోనికి అడుగు మోపగానే వరదప్ప కాంతి శరీరం గాలి శరీరం గా మారిపోయింది.

ఏవేవో పూర్వ వాసనల్! అనుభవాల జ్ఞాపకాల్! సంబంధ బాంధవ్యాల్! ఇష్టానిష్టాల్! అలవాట్లూ, అభి రుచుల్! భూగోళమ్మీద మనిషికి తప్ప ఇతర ఏ జీవికీ లేని అప్పుల బాధల జ్ఞాపకాల్!

'నా భూమి! నా భూమి... నా భూమి అట్లే ఉందా? లేక కొంజేటి నారాయణ శెట్టి తన్నుకుపోయి నాడా?'

అప్పటికి తన భూమిలోని వేపచెట్టు కింద దయ్యం మాదిరి కూర్చొని ఉన్నాడు వరదప్ప. లేచి మట్టిని వాసన చూసినాడు. అది తన భార్యాపిల్లల చమట వాసన!

అమ్మయ్య! ఇది నా భూమే! అని నిశ్చయం చేసుకొన్నాడు.

అది నాలుగెకరాల ఎర్రనేల! తన చావుకు కారణ మైన బోరుబావి అదిగో, వంకకు ఆనుకొని ఉన్న ఈశాన్యపు మూల. వంక పారక పజ్జెనిమిదేళ్లు దాటింది. అయినా ఇసుక పర్రల్ని మొండిగా కరచి పట్టుకున్నాయి పొట్టి ఈతచెట్లు.

ఎండిపోయిన ఏరును చూస్తే తన తండ్రి గుర్తొస్తాడు వరదప్పకి. ఏరు ప్రవహించే కాలంలో దాని పక్కన గుంత తోడి, ఆ గుంతలోకి నీళ్లు మళ్లించి, ఆ గుంతలోని నీళ్లని తోలుబొక్కెనతో కాలవలోకి తోడి, పంటచేను తడిపేవాడు అతని తండ్రి! అతడు రాత్రి వల వేసి పొద్దునికి కొడదలు పట్టి తెచ్చేవాడు. ఒకసారి ఏట్లో నిలబడి తండ్రి నవ్విన నవ్వు ఇప్పటికీ వరదప్పకు జ్ఞాపకం- ఏట్లో కాళ్లకు తాబేలు తగిలి, దాన్ని పట్ట బోయి, అది చేతుల్లోంచి జారిపోతుంటే కాళ్లతో తొక్కి పట్టి దాని కదలికల స్పర్శకు పగలబడి నవ్వి, రెండు చేతుల్తో పట్టి ఎత్తి గబుక్కున గట్టున విసిరేస్తే కాసేపటికి బోర్లించిన చిప్పలోంచి నిగిడిన తాబేలు మెడ విచిత్రం గా! ఇప్పుడు ఆ ఏరూ లేదు. నీళ్లూ లేవు. పప్పూరి రామా చారులు చెప్పిన ఆ గుడ్డి మేఘమే గది!!

రెండు దినాల కిందట వాన వచ్చి పదునైంది. భూమిని తిరగ్గొట్టినారు. విత్తే దానికి సిద్ధంగా ఉన్నారు. వేపచెట్టు కింద కూర్చున్న వరదప్పకు అల్లంతలో కనిపించిన దృశ్యం.

అతని భార్య విత్తనం వేసే గొర్రును భుజమ్మీద మోసుకొని వస్తూ ఉంది. తన పదహారేండ్ల కూతురు విత్తనం కాయల మూటను మోయలేక మోసుకొస్తూ ఉంది. ఆరో తరగతి కొడుకు బడి ఎగ్గొట్టి ఎద్దును తోలుకొని వస్తూ ఉన్నాడు.

ఇంకొక ఎద్దు ఏదీ?

అయ్యో! అప్పులవాళ్లు పట్టుకుపోయినట్లున్నారు. లేకపోతే తన ఇంట్లోవాళ్లే తన అంత్యక్రియలకు దాన్ని అమ్మి పారేసినారేమో!

మల్ల ఇప్పుడు వీళ్లు ఏం చేస్తారు? ఒక ఎద్దుతో సేద్యమా?

ఆ ఎద్దు నుదుట కూతురు కుంకుమ పూసింది. కొడుకు గొర్రుమోటికి కొబ్బరికాయ కొట్టినాడు. ఎద్దుకు బెల్లపుంటను ప్రసాదంగా తినిపించింది భార్య. అట్ల భూమికి పూజచేసి అదే ప్రసాదం బొరుగుల్ని తాము పంచుకొని తిన్నారు. ఆ తర్వాత ఆకాశానికి మొక్కుకుని పని ప్రారంభించినారు వాళ్లు ముగ్గురూ.

వరదప్ప భార్య లేచింది. కొంగు బిగించి బొడ్లోకి దోపుకుంది. గుంటకకు ఒకవైపు ఎద్దును కట్టింది. మరోవైపు కాడిని తన మెడ మీద మోపుకుంది. కూతురు గోచి పోసుకొని గోచిలో ఇత్తనాలు నింపుకొని గొర్రు పట్టుకొని విత్తడానికి సిద్ధంగా ఉంది.

''అదిలించరా ఎద్దుని.''

ఒక కాడిని ఎద్దు ఈడుస్తా ఉంది. పక్కన ఇంకొక కాడిని వరదప్ప భార్య ఈడుస్తా ఉంది.

తన భార్య ఎద్దు మాదిరి కష్టిస్తుంది. ఇప్పుడు నిజంగా ఎద్దే అయింది. ఎవరి కోసం? తన కూతురు కోసం, తన కొడుకు కోసం! అయ్యో! నేను చచ్చిపో కుండా వుంటే, ఇప్పుడు నా భార్య మోసే కాడిని నేను మోసేవాన్ని కానా??

కాలం గడుస్తా ఉంది. సేద్యం చేసిన చాళ్లలో బెత్తెడు బెత్తెడు దూరంగా వేరుశనగ విత్తనాలు పడు తున్నాయి, కూతురు పిడికిట్లోంచీ.

ఆ చల్లటి పొద్దుటిపూటే తన భార్య తలలోంచీ చెమటలు పుట్టి, ధారాపాతంగా కొప్పులోంచీ మెడ కిందికి జారిపోతుంటే...

"అమా! మా! కొంచెంసేపు అలుపు తీర్చుకో! నేను మోసుకుంటా కాడి?" అని వెనక నుంచీ కూతురు అరిస్తే-

"ఇంకొంచెంసేపు పోనీయమ్మా! తర్వాత నీకెట్లా తప్పదుకదా" అని ఎద్దుతో బాటు కాడి మోసుకుని, ఆ కాడిని రెండు చేతుల్తో పెనవేసుకుని ఈడుస్తున్న భార్య.

వరదప్పలో ఏదో తప్పు చేసినాను అన్న భావం తొలిచి వేస్తూ ఉంది. అయినా తన గాలి శరీరానికి కన్నీళ్లు రావే! ఎంత ప్రారబ్దం?

గంట గడిచింది.

కాడి తన మెడ మింద మోసుకుని ఈడ్చేది మొదలుపెట్టింది కూతురు.

మొదటగా కూతురు పుడితే, ఇంటికి మహా లచ్చిమి వచ్చిందని ఆ పేరే పెట్టుకున్నాడు వరదప్ప.

కూతురు గుంటకను ఈడుస్తా ఉంటే, తల్లి గోసిలో ఇత్తనాలు పోసుకుని ఒకటీ రెండూ జారవిడుస్తా ఉంది.

ఏదో అనుమానమొచ్చి, చప్పున ఆగింది కూతురు. మెడ నుంచీ కాడిని దించి వెనక్కి వచ్చి చాలులో ఇత్తనాలను తేరిపార జూసి అరిచింది-

"మా! అందుకే నిన్ను మా నాయన తిడతాండె. చూడు, పడిన చోట నాలుగైదు ఇత్తనాలు పడినాయి. లేనిచోట లేనేలేవు. ఇట్లేనా ఇత్తనమేసేది?"

భోరున ఏడుస్తా కిందికి కూలబడింది తల్లి-

"ఇత్తనమేస్తుంటే మీ నాయనే గుర్తుకొస్తున్నాడే లచ్చిమీ! తిట్టే! మీ నాయన బదులు నువ్వన్నా తిట్టే!"

"అమా! మా!!" అని ఏడుస్తా తల్లిని భయంతో చుట్టేసుకుంటున్న కొడుకు.

వరదప్ప గాలి శరీరంలో, ఇంకా ఏ మూలో హృదయం మిగిలి ఉన్నట్లు నొప్పి! దుఃఖం!!

గంటయినా, రెండు గంటలయినా తల్లి బతి మాలుతున్నా మెడమీద కాడిని వదలకుండా ఈడు స్తున్న తన కూతురు! తన ఇంటి మహాలచ్చిమి!!

ఆ ముగ్గురూ వేపచెట్టు కింద చేరి, ముద్దను అరచేతిలో పెట్టుకుని, విరిచి విరిచి ఊరిబిండిలోకి అద్దుకు తింటూ వారు మాట్లాడే మాటలూ, నెమరేసు కునే జ్ఞాపకాలూ అన్నీ వరదప్ప చుట్టుకారమే తిరుగు తున్నాయి.

"నాయన బీడీ ముట్టించే ముందు కాఫీ అడుగు తాండె కదామా?" అంటున్న కూతురు.

'అయ్యో! నేనంటే ఎంత నెర్లు వీళ్లకు. ఆ కాంతి లోకంలో వీళ్ల గుర్తుకు కూడా రాలేదే నాకు? ఎంత నమ్మకద్రోహిని. పైగా స్వర్గానికి ఎందుకు పంపవు నన్ను అని ఆ దేవునితో బుద్ధి లేకుండా వాదులాడితినే! నేను మనిషిని కాను, నాకంటే పసరం మేలు' అని తల్లడిల్లి పోయినాడు వరదప్ప.

ఆ మధ్యాన్నం ఎండ ముఖం మీద కొడతా ఉంటే, గొర్రును మెడ మీద మోసుకుని ఈడుస్తున్న భార్య దగ్గరకు పరుగెత్తింది వరదప్ప గాలి శరీరం-

'ఏమే! తీ! ఇడుసు! కాడి ఇడిసిపెట్టు. నేనున్నానే! నేను ఈడుస్తానే' అని కాడిని చేతుల్తో పట్టుకుంటే... చేతులేవీ? గాలిచేతులు!

"నేనూ కొంచెంసేపు ఈడుస్తామా!" అని ఉబ లాటపడుతున్న కొడుకు. ఆ మాటకే తల్లి మురిసి పోతుంటే-

నాకంటే నా కొడుకే మేలు. వాని మాదిరి మాట సాయం చేసేదానికి కూడా నాకు రాదే! ఉత్త గాలినోరు!!! అనుకుని కుమిలిపోయినాడు వరదప్ప.

హఠాత్తుగా కళ్లు బైర్లుకమ్మి కాడి వదిలేసి కుప్ప కూలిపోయింది భార్య. కూతురూ కొడుకూ ఏడ్పు గొంతుతో అరుస్తున్నారు తల్లిని అటూ ఇటూ కుదుపుతూ.

'అయ్యో నువ్వు పోతే ఎట్లనే? పిల్లోల్ల గతి ఏం కావల్లనే? సావద్దే! బతుకే!' అంటూ ఆమె శరీరం చుట్టూ వెర్రి గంతులేస్తున్న వరదప్ప గాలి శరీరం.

స్వర్గం నుంచి కిసుక్కున నవ్వినట్లున్న గొంతు-

"ఏం వరదప్పా? నువ్వేమో హాయిగా చచ్చిపో వచ్చు. నీ భార్య మాత్రం నీ పిల్లల కోసం బతికి వుండాల్నా? నీ సంసారం బరువును నీ భార్య ఒక్కతే మోయాల్నా? ఏం న్యాయమయ్యా నీది?"

*

ఆ దినం మధ్యాన్నం చంకల్లో పిగిలిపోయిన రవికను సూదీదారంతో కుట్టుకుంటూ ఉంది కూతురు. కొడుకును కూర్చోబెట్టి వంగదీసి తలలో పేన్లు చూస్తా ఉంది వరదప్ప భార్య.

అవునవును, అప్పుడప్పుడు ఇది నన్నూ ఇట్లే వంగ దీసి తలలో పేన్లు చూసేది. చిక్కంటితో దువ్వి ఈపులు

ఇరిసేది అని వరదప్ప తన గాలి తలను గాలి చేత్తో నిమురుకుంటూ ఉండగా-

"నాయనా! రేపు నీవు చేన్లోకి పోవల్ల. సాల్లలో ఏసిన ఇత్తనాలను ఆ పాడు కోతులు తవ్వుకుని తింటాయి. దాన్లని అదిలించల్ల."

"పోమా! ఇప్పటికే మూడు దినాలు ఎగిరిపో యింది బడి. లెక్కలు చానా అయిపోయింటాయి."

"బడి ఇడిసిపెట్టు నాయనా! మన పరిస్థితి బాగా లేదు."

"ఏమో పో! నేను బడికి పోతా! బాగా సదువుకుని అయ్యవారు కావల్ల అని చెప్తాండె నాయన!"

"థూత్ బేవార్సి నాకొడకా!" అని ఒడిలో కూర్చున్న కొడుకుని విదిలించి పారేసింది తల్లి-

"నీ సదువుకు మీ నాయన ఇక్కడేమన్నా మూటాముల్లె గంటేసి పోయినాడేం రా? ఇంట్లో పెండ్లి కెదిగిన పాపను పెట్టుకుని, ఆ పాపను ఒక అయ్య చేతిలో ఎట్ల పెడదామా అని నేను ఎత పడుతుంటే సదువో సదువో అని అంగలారుస్తావేమిరా ముదనష్టం నా కొడకా!"

చిన్న గొంతుతో మూలిగినాడు కొడుకు-

"కోతుల కాయిలికి అక్కను పంపితేనేమో!"

"ఈడొచ్చిన ఆడపిల్లను అడవిలోకి ఒంటరిగా పంపేది ఎట్లరా, దున్నపోతా?" అని అరిచింది అసహనంగా.

తెగించినట్లు దృఢంగా అన్నాడు కొడుకు-

"ఏమోపో! నేను పొయ్యేదే! నాయనే బతికింటే నన్ను సదువు ఇడిపించేవాడా?"

"ఎవడ్రా మీ నాయన? పురుగుల మందు తాగి సచ్చి ఆయన స్వర్గానికి పోతే, ఈ సంసారం బరువంతా నేనొక్కదాన్నీ మోయాల్నా? ఏడీ పిలుసు మీ నాయన్ను! తండ్రీకొడుకులిద్దరినీ కలిపి పరకతో కొడతా!"

రోష పడుతూ చూసినాడు కొడుకు- "మా నాయన్ను ఏమన్నా అన్నావంటే చూడు."

"ఏం చేస్తావురా? ఏం చేస్తావు?" తల్లి పొయ్యి పక్కనున్న ఊపుడుగొయ్యి తీసుకుని కొడుతుంటే ఆ కొడుకు అలవాటు ప్రకారం-

"రా! నాయనా! అమ్మ నన్ను సంపేస్తాంది రా! నాయనా!" అని అరుస్తుండగా కొడుకును ఆర్తిగా చుట్టేసుకున్నాడు వరదప్ప! గాలి శరీరం!! తండ్రి గాలి శరీరంలోంచీ దూరి ఊపుడుగొయ్యి దెబ్బలు పడు తుంటే 'రా! నాయనా!' అని అరుస్తున్న కొడుకు.

వరదప్ప గాలి శరీరమంతా పాపపు మూటైంది. కొడుకు చేను నుంచీ కోతులు తోలుతూ తల్లి దెబ్బలకు అడ్డం పెట్టిన చేతివేళ్లకు పడిన ఊపుడుగొయ్యి దెబ్బలు చూసుకుంటూ, ఎక్కిళ్లు పట్టి ఏడుస్తూ...

'నా చిట్టీ చేతులు చక్కటి రాతలు నేర్వ లేదయ్యో!....'

వరదప్ప గాలి శరీరంలో ఖేదం నిప్పులా రాజు కుంది-

అయ్యో! తన కొడుకు రాత కూడా ఇంతేనా? తన తండ్రి మాదిరీ తన మాదిరీ తన కొడుకు కూడా సేద్యం లో కూరుకుపోవలసిందేనా? వ్యవసాయ వృత్తికే కాదు తమ ఆత్మహత్యలకు కూడా తన కొడుకు వారసత్వం పొందవలసిందేనా?

చేను పక్క ఏరు ఎండిపోయిన అయిదేండ్లకు వరదప్ప తండ్రి బావి తవ్వించినాడు. తవ్వించిన అయి దేండ్లకు ఆ బావి ఒక్క నీటిచుక్క లేకుండా ఎండిపో యింది. బావి మీద చేసిన అప్పే వరదప్ప తండ్రికి ఉరితాడయింది.

ఇరవై ఏండ్లు గడిచినాయి. వరదప్పకు ఒక దినం అత్యాశతో కూడిన ఆలోచన వచ్చింది. తన చేనులో బోరు వేయించి పంట పెట్టాలనే కోరిక అతని బుర్రను కుమ్మరి పురుగు మాదిరి తొలిచేసింది. ఇన్నూరు అడుగులు పైపులు దింపినా బోరులో చుక్క నీళ్లు పడ లేదు. వ్యవసాయబోరు మీద చేసిన అప్పే వరదప్పకు పురుగులమందు అయింది.

*

వరదప్ప పెళ్లాం కూరగాయల మండీకి పోయి గంపెత్తి అరుస్తూ వీధి వీధి తిరుగుతూ ఉంది.

...అవునవును. పెళ్లాం కూరగాయలు అమ్ముతా నంటే రోషమొచ్చి- మనం రైతులమే! యాపారస్తులం కాదు. అని గర్జించిన సందర్భం లేదా? ఇప్పుడూ...? దానికి స్వేచ్ఛ! కూరగాయలు అమ్మో బతకొచ్చు. పిండి మిరపకాయలు వేసుకునీ బతకొచ్చు. ఇప్పుడది బతికే దానికి తన మీసాలు అడ్డంరావు.

బెండకాయల్, బీరకాయల్, టమోటాలూ, వంకాయల్, కోతిమీరా, కరివేపాకమ్మో...! అని మెడను నలగదీసే ఆ గంప కింద ఆ యమ్మ కూతలేస్తుంటే ఏం సహాయం చేయలేని అసమర్థుడై గాలి శరీరంతో వెంబడిస్తున్న వరదప్ప!

"ఓ కూరగాయలమ్మో! ఇక్కడరా!" అనే పిలుపు ముంగిట పెళ్లాం ఆగి గంప దింపుతుంటే- వద్దు వద్దు.

ఇక్కడ ఆగవద్దే! నాశనమైపోతావే!! అని అరుస్తున్న వరదప్ప.

ఆ ఇల్లు ఎవరిది? ఎవరిదీ కాదు. పల్లెటూళ్ల నుంచీ బతకడానికి వచ్చిన రైతు ఇల్లాళ్లు వేశ్యా వ్యాపారం చేసుకునే ఇల్లు!

తన చుట్టుకారమూ ఏనుగు మాదిరి బలిసి ఉంది ఆ బ్రోకర్ ఆడమనిషి. ఏదో అడుగుతా ఉంది. తన భార్య వెతలు వెల్లబోసుకుని కంట్లో నీళ్లు కొంగుతో ఒత్తుకుంటూ ఉంది. బ్రోకరాడమనిషి తన భార్య కష్టాలను విచారించి అట్లా జాలి ఒలకబోస్తుంటే-

'అయ్యో! ఇక్కడ వద్దే! పో! ఇది బోగం కొంప! మోసపోతావ్! నిన్ను ఉచ్చులోకి లాగుతారు. పో! పోయే!!' అని భార్య చెవిలో ఇల్లు కట్టుకుని అరిచినా, తన గాలి మాటలు వినపడవే! దేవుడా నన్ను క్షమించు కట్టుకున్న భార్య బోగం కొంపల పాలబడుతుందని తెలిసివుంటే నేను ఆత్మహత్య చేసుకునేవాణ్ణా?

*

తల్లి, ఇల్లు చేరి చంకలో మోచేత్తో అదుముకున్న ఉత్తగంపను మూలకు పెట్టి పైటచెంగుతో చెమట ముఖాన్ని ఊపుకుంటూ బైటికి రాగా-

ఇంటి ముందు అరుగుపక్కన ఆడంగుల వికవికలు. పకపకలు.

రోషమొచ్చిన తల్లి ఇంట్లోకి దూకి- ''ఏమో లచ్చిమీ? ఎవడొచ్చినాడు ఇంట్లోకి, నేను లేనప్పుడు? ఎవుర్ని రానిస్తివే? నీ పెండ్లి కోసరం నేను పడరాని పాట్లు పడుతుంటే, ఎవునితో నీ సరసం గ్రంథసాంగురాలా?'' అంటూ కూతుర్ని ధబీధబీమని గుద్దింది.

''అయ్యో? నా మహాలచ్చిమిని సంపద్దే! అది తన అయ్యవారే వస్తే నీళ్లిచ్చి కూర్చోబెట్టి మాట్లాడిచ్చి పంపించింది. నాకు తెలుసు. నేను అప్పుడు దాని పక్కనే ఉన్నా! నా మాట వినవే!'' అని వరదప్ప తన గాలి శరీరంతో చుట్రగాలి మాదిరి కొట్టుకుంటున్నా ఆ యమ్మ చెవిలో పడక-

''మీ నాయన బతికుంటే ఇంత బరితెగించే దానివా? ఎందుకే నీ బతుకు, సావక...?''

'అయ్యో! నా బిడ్డని అంత మాట అనొద్దే!' అని వరదప్ప అడ్డంపోయినా, కూతుర్ని మళ్లీ పిడికిళ్లతో గుద్దబోతుంటే...

''అమ్మా! నాకేం తెలీదమ్మా!'' అని ఆ పెళ్లీడు పాప- ''నాయనా! ఎక్కడున్నావు నాయనా! నేను తప్పు చేయలేదని అమ్మకు చెప్పు నాయనా'' అని దుఃఖంతో అరుస్తుండగా...

వరదప్ప ఆత్మలో దుఃఖపు మూలుగు- అమ్మా! తల్లీ!! లచ్చిమీ!!!

*

ఆ సాయంత్రం... 'నాయనా! నాయనా! నువ్వుంటే నాకిట్ల జరిగేదా? నా మీద ఇంత నింద వేస్తే, చూస్తూ ఊరుకునే వానివా?? నేనూ నీ దగ్గరికే వస్తా నాయనా?' అని కూతురు రోషపడి ఏడుస్తూ, ఎండిన చెరువు కట్టమీద గన్నేరుకాయలు నూరుతుండగా-

వరదప్ప గుండెలో గునపాలు దిగినట్లు- 'తల్లీ! వద్దమ్మా!' అని అరిచినాడు.

నూరినదంతా గిన్నెకెత్తుకుని నీళ్లు కలుపుకుని తాగబోతూ ఉంది కూతురు.

తన కూతురి చేతిలోని విషంగిన్నెను పక్కకు తోసివేసే బలంలేని గాలిచేతుల్తో గాలి తల బాదుకుంటూ...

వరదప్ప, కాంతి కాంతిగా పొంగి విరిగి నలుపు నలుపుగా మారి, కూతుర్ని కాపాడుకోలేని బేలతనంతో ఒక్క పెట్టున అరిచినాడు.

'దేవుడా తప్పు చేసినాను. నా కూతుర్ని కాపాడు.'

*

వరదప్ప ఎదురుగా గాలి వాతావరణంలో తెల్లటి చుక్క ఏర్పడి పాలసుడిగా గింగిరాలు తిరిగి, కాంతి సొరంగం ఏర్పడితే దాంట్లో వరదప్ప కాంతి శరీరం పొంది తేలిపోతున్నాడు పైకి!

అతనికి రెండు వైపులా దేవదూతలు తేలుతూ దారి చూపించగా- దేవదేవుని ముందు చేతులు కట్టుకుని నిలబడినాడు.

''చెప్పు వరదప్పా! నువ్వు ఆత్మహత్య చేసుకుని ఏం సాధించినావో చెప్పు!'' అన్నాడు దేవుడు. భూమ్మీదికి కిసుక్కున విన్పించిన ఆ గొంతే ఇప్పుడు పరమ గంభీరంగా మారిపోయింది.

''నేను, ఆత్మహత్య చేసుకోవడం తప్పే అని తెలిసివచ్చింది దేవదేవా!'' తల వంచుకున్నాడు వరదప్ప.

''మరి నిన్ను స్వర్గానికి పంపించమంటావా?''

చదువు చంక నాకిపోయిన కొడుకూ, బోగం కొంపల ముంగిట్లో భార్యా, గన్నేరు కాయలు నూరుకునే కూతురూ... భూమ్మీది జ్ఞాపకాలకు తల విదిలించినాడు వరదప్ప-

''ఆత్మహత్య చేసుకుని భార్యాబిడ్డలకు నరకం చూపించిన నాకు స్వర్గానికి పోయే అర్హత ఎక్కడుంది మహాదేవా?''

దేవుడు సాలోచనగా చూసినాడు-

"స్వర్గానికి పోనంటావ్. అది నీ ఇష్టం. రైతును నరకానికి పంపించకూడదు. అది నా సూత్రం. మరి నీకు ఏ శిక్ష వెయ్యమంటావో చెప్పు."

వరదప్ప చేతులు జోడించి ప్రార్థించినాడు-

"దేవా! నాకు స్వర్గమూ వద్దు. నరకమూ వద్దు. నన్ను నా భూమి మీదికే పంపు."

దేవుడు ప్రసన్నంగా నవ్వినాడు-

"సరే అట్లే పంపుతా. ఈసారైనా సత్యం బోధపర చుకో! నువ్వు బూమమ్మ రుణం తీర్చుకోవాలంటే రెండే మార్గాలు. ఒకటి, మనిషి కోసం పోరాడేది. రెండు, మనిషికి సేవ చేసుకుంటూ బతికేది. ఈ కర్మ మార్గాల్లో నువ్వు దేన్ని ఎన్నుకుంటావో చెప్పు."

దేవుని ముఖం చప్పున మారిపోయింది. కళ్లు కుంచించుకుపోయి, తీక్షణమైన చూపుతో అతని పాత జ్ఞాపకాల్ని కెలికినట్లుగా చూసినాడు.

వరదప్ప మెదడులో జ్ఞాపకాల కంతి పగిలింది. మాటలూ దృశ్యాలూ స్రవించి కళ్ల ముందుకు కొట్టు కొస్తున్నాయి.

అప్పుడు ఇరవై ఏండ్లు వరదప్పకు. ఇంకా పెండ్లి కాలేదు. తల్లీ తండ్రీ మాట్లాడుతుంటే, పశువులకు నీళ్లు తాపుతూ వింటున్నాడు.

తల్లి అంటా ఉంది- "బావీ గీవీ అని లంపటం యాల పెట్టుకుంటావే! ఆ నాలుగెకరాలూ అమ్మి నాలుగు రూకలు చేతిలో పెట్టుకుందాము. పామిడికి పోయి బట్టలు తీసుకొచ్చి అమ్ముదాము."

దానికి తండ్రి ఏమన్నాడు?-

"మనం రైతులమే పనికిమాలిన ముండా! యాపారస్తులం కాదు" అని అరిచినాడు.

"తెలుగుదేశం గవర్నమెంటు వచ్చింది. హంద్రీ నీవా తెస్తుందంట. హంద్రీనీవా కాలువ మన భూమి పక్క వంకలోనే పోతుందంట. ఇంక చూస్కో, నీల్లే నీల్లు! సంవత్సరానికి రెండు పంటలు!!" అని ఉబ్బి తబ్బిబ్బయినాడు.

ఇప్పుడు నలభై అయిదేండ్లు వరదప్పకు. పెండ్లామూ, పిల్లలూ ఏర్పడినారు. పెండ్లాం మాట్లాడు తుంటే, వింటున్నాడు.

భార్య అంటా ఉంది-

"బోరూగీరూ అని ఊరికే ఉన్న మెడకు ఉరి ఎందుకు పెట్టుకుంటావే? ఆ నాలుగెకరాలూ అమ్మి టౌను చేరదాం. ప్లాట్ల యాపారం చేస్తే లచ్చలు సంపా దిచ్చుకోవచ్చుంట!"

దానికి వరదప్ప ఏమన్నాడు?-

"మనం రైతులమే దర్బేసిముండా! యాపార స్తులం కాదు," అని రంకెలేసినాడు.

"ఈ కాంగ్రెసు గవర్నమెంటులో హంద్రీనీవా గ్యారెంటీ. ఈ అయిదేండ్లూ బోరు ఏపిచ్చుకుని భూమిని కాపాడుకుంటే చాలు. ఇంక చూస్కో! నీల్లే నీల్లు. మన ఇల్లు బంగారుపొగ ఎగరల్ల" అని కుశాల పడినాడు.

బంగారుపొగ ఏమోగానీ, హంద్రీనీవా ఆశతోనే పొగ చూరిపోయిన దశాబ్దాలు! అయిదారు ప్రభుత్వాలు వచ్చిపోయినా, కొనసాగుతూనే ఉన్న నీళ్లు లేని సీమ సేద్యపు తమాషాలు! బోరుబావుల అప్పుల కింద అనంత రైతుల ఆత్మహత్యలు!

కాంగ్రెస్ పోయి తెలుగుదేశమొచ్చె డుం డుం డుం.

తెలుగుదేశం పోయి కాంగ్రెస్ వచ్చె డుం డుం డుం.

ఇరవై అయిదేండ్లుగా హంద్రీనీవాతో ఆడు కున్నది వాళ్లే!

రైతు ఆత్మహత్యలకు కారణం వాళ్లే!!

ఒక ఇంట్లో రెండు ఆత్మహత్యల రహస్యం గుప్పిళ్లు విప్పుకుంది.

వరదప్పకు కర్తవ్యం బోధపడింది.

ధార్మికమైన ఆవేశంతో అతని వదనం గంభీర మైంది.

ఒక్క వీక్షణంతో తన కర్మమార్గాన్ని తనకు గుర్తు చేసిన దేవునికి చేతులెత్తి నమస్కరించినాడు వరదప్ప-

"నీ గుంజకు కట్టివేసిన ఎద్దుని! నీ చేతిలోని పని ముట్టును. నన్ను వాడుకో!"

చిద్విలాసంగా నవ్వి, "తథాస్తు," అన్నాడు దేవుడు!

*

యాగంటి!

యాగంటి గుట్టల నిశ్శబ్దాల మధ్య పాతాళ గంగమ్మ జలారావాలు. లోనంతా నిండి బైటికి పొర్లే కోనేటి నీటి మధ్య ఒంటరి రాతిమంటపం.

చీకటి గుండె అదిరేటట్లు యాగంటి బసవయ్య కళ్లు తెరిచింది. బసవయ్య రాతి శరీరంలో మెత్తగా విచ్చుకున్న కనుగుడ్లు. యాగంటి బసవయ్య కనుగుడ్ల లోని ఎరుపు జీరలు వరదప్ప క్రోధమే!!

రాతి బసవయ్య లేచి నిలబడి మూపురాన్ని విదిలిస్తే, పెఠిల్లుమని నాలుగు రాతిపెచ్చులు ఎగిరిపడి నాయి.

బసవయ్య రాతితోక నిగిడ్చింది. రాతి మెడను ఓరగా వంచి ఒక్క రంకె వేసింది. బసవయ్య కాలు దువ్విన గిట్టల రాపిడికి నేల మించీ నిప్పురవ్వలు లేచినాయి.

తన వృత్తికి అదనంగా నాలుగైదు వ్యాపారాలు చేసుకునేవానికి, డబ్బు పట్ల ప్రేమ ఉంటుంది కానీ తన వృత్తిపట్ల, స్వధర్మంపట్ల బాధ్యత ఎందుకుంటుంది? వ్యాపారాలూ కంట్రాక్టుల్లో మునిగితేలే రాజకీయ నాయకులు హంద్రీనీవా ఎప్పుడు తెస్తారు?? ఈరోజుతో వాళ్లకు భూమ్మీద నూకలు చెల్లిపోయినాయి.

రాజ్యాన్ని పరిపాలించవలసింది సన్యాసులూ, దేశభక్తులూ మాత్రమే!!!

కాలవ కంట్రాక్టులూ, బస్సుల వ్యాపారాలూ, లిక్కర్‌షాపులూ, సెజ్‌లూ, భూ ఆక్రమణలూ, ఇనుమూ, గ్రానైట్, సుద్దరాయి ఖనిజాల వ్యాపారాల మధ్య దుమ్ము లేపుతూ వచ్చిన యాగంటి బసవయ్య హుంకరిస్తూ ఉంది.

మోర వంచి తల ఊపితే మెడ గంటల మృత్యుఘోష!

కాలు దువ్వి రంకేస్తే, చీకటి భళ్లున పగిలిన మిరుమిట్లు!!

యాగంటి బసవయ్య పద్నాలుగు బసవన్నలుగా విడిపోయింది.

ఎన్నికల ఋతువు కదా...! ప్రజల అవసరాలకు మించి మద్యమోత్పత్తులు హెచ్చుతున్న వేళ...

ప్రజలు ఓటర్లుగా పూపాదశలోకి మారుతున్న వేళ...

రాజధానికీ నియోజకవర్గాలకూ మధ్య-

సూటుకేసుల పంపకాలు జరుగుతున్న వేళ...

అందరు రాజకీయ వ్యాపారస్తుల్నీ ఒక్క కుమ్ము కుమ్మింది ఒక్కొక్క బసవన్నా!

ఖద్దరు రెడ్లూ, పసుపుపచ్చల నాయుళ్లూ, వారి నల్ల నల్లటి ముడ్డీలను నాకే రిజర్వేషన్ ఎమ్మెల్యేలూ, పైవారి పబ్బం గడపడానికి ఉపయోగపడే బిసి శిఖండీలూ... అందరిలోని ఆ వ్యాపారరక్తంతోనే బసవన్న రాతికొమ్ములు సిక్తమయినాయి. ఆ నాయకుల రేపటి కిరీటాలు బసవన్నల కాలిగిట్టల కింద గిలగిలా కొట్టుకుంటున్నాయి.

ఒకే ఒక్క బసవన్నకు మాత్రం నెత్తురంట లేదు.

ఏమైందేమైంది. ఏం జరిగిందేం జరిగింది.

ఆ ఒక్క నాయకుడూ ఎట్ల తప్పించుకున్నాడు?

చెవులు రిక్కించింది బసవన్న.

చూపు నిగిడ్చింది బసవన్న.

ముక్కు పుటాలెగరేసింది బసవన్న.

వాడు మనిషి వాసనే వెయ్యడు!

అడుగడుగో తెలుగునాడు సరిహద్దుల్లో వాడు!

అనంతపురం జిల్లాను చుట్ట చుట్టి చంకలో పెట్టుకుని కర్ణాటకలో నిమజ్జనం చేయబోతున్నవాడు! అనంతకు తుంగతప్ప దిక్కులేదనే మహా సత్యం కనుక్కోవడంకోసమే రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా ఊరేగిన వాడు! తన బెంగుళూరు వ్యాపారాల్ని భద్రం చేసుకోవడానికి కన్నడ కిరీటం కోసం ఆశపడుతున్నవాడు!

ఒక్క కుమ్ము కుమ్మింది బసవన్న.

అంతే! అతడు నోట్లోంచీ కక్కుకున్న నోట్ల కట్టలు!!!

*

యాగంటి బసవయ్య కొనేట్లో మునిగింది. శివుని ముందు మోకరిల్లింది. కళ్లతోసహా స్థాణువుగా మారింది. బసవడి నుంచి విడుదల పొందినాడు వరదప్ప. దేవదేవుని ఆనతిమీద రెండవ కర్మమార్గంలోకి ప్రవేశించినాడు.

సూక్ష్మలోకపు పాలవెలుగులో నల్లటి చుక్క ఏర్పడింది. అది కంతగా విచ్చుకొంది. చీకటి సొరంగం మాదిరి ఏర్పడింది. వరదప్ప ఆ సొరంగంలో దూరి జారుతూ జారుతూ వచ్చి- భూగోళం మీద తన పెంకుల కొట్టం దొడ్డి గుమ్మం వెనకల, ఆవు నొప్పులు పడుతూ దూడను ఈనుతుంటే ఆ దూడలోంచీ తొలి ఊపిరి తీసుకుని, లేగదూడై భూమ్మీద పడినాడు.

"కోడెదూడ అమ్మా! కోడెదూడ!! రెండో కాడి మోసి, మన చేను దున్నుతుంది," అని వరదప్ప కొడుకు మట్టి కొట్టుకున్న శరీరంతో గంతులేస్తుండగా-

వరదప్ప భార్య, లేత కొబ్బరివంటి లేగదూడ కాలిగోర్లను గిల్లివేయబోయి, అబ్బురపడి ఆగిపోయింది. నమ్మలేనట్లు దూడ కాళ్లని మరోసారి చేతుల్తో గట్టిగా తడిమింది.

...అవి రాతిగిట్టలు!!!

*ఆదివారం వార్త, 12, 19 ఏప్రిల్ 2009*